# ANDHRA PRADESH HISTORY CONGRESS

## PROCEEDINGS OF THE FORTY SECOND SESSION NARSAPUR - 2018

ISSN 2320-057X

# ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంస్కరణోద్యమాలు - కందుకూరి వీరేశలింగం - ఒక విశ్లేషణ

**A. Santosh Rao,** M.A., M.Phil , SLET., (P.hD)
Lecturer in History, Y.V.N.R Govt. Degree Colllege
Kaikalur, Krishna District

ఆంధ్రదేశమున సంఘ సంస్కరణోద్యమమును ప్రప్రథమముగా ప్రారంభించిన మహనీయులు కందుకూరి వీరేశలింగం గారు (క్రీ.శ.1848–1919). వీరిపై బ్రహ్మసమాజ ప్రభావము చాలా గలదు. ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రామమోహనరాయ్, కేశవచంద్రసేన్ మున్నగు సంఘ సంస్కర్తల రచనచే వీరు ప్రభావితులైరి. బెంగాలులో ఈశ్వర చంద్రుడు మొదలగు వారట్లు ఆంధ్ర దేశమున సంఘ సంస్కరణోద్యమమును ప్రారంభించిరి.

## 19వ శతాబ్దంలో ఆంధ్రదేశం

ఆంధ్రదేశం పందొమ్మిదవ శతాబ్ది నాటికి అవిభక్త మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండేది. ఆంధ్ర, కోస్తా ప్రాంతం నైజాం నవాబు నుండి లభించిన దత్తమండలం బ్రిటీషు వాళ్ళ అధికారం క్రిందికి వచ్చాయి. 1857 నాటిసిపాయి తిరుగుబాటు తరువాత భారతదేశ పరిపాలన భారం ఈస్టిండియా కంపెనీ నుండి ప్రత్యక్షంగా బ్రిటీషు ప్రభుత్వం క్రిందకు వెళ్ళడంతో దేశమంతా ఒకే రకమైన పరిపాలనా విధానాన్ని ప్రవేశ పెట్టడానికి, అవకాశం యేర్పడింది. దీంతో పాటుగా 1857లో కలకత్తా, మద్రాసు, బొంబాయిలలో విశ్వవిద్యాలయాలు స్థాపింపబడ్డాయి. 1835లోనే మెకాలే సూచనల ననుసరించి ఇంగ్లీషు విద్యావిధానం విలియం బెంటిక్ దేశంలో ప్రవేశపెట్టాడు.

ఇంగ్లీషు భాష దేశమంతా వ్యాపించటం వల్ల అంతకు ముందులేని సౌలభ్యం యేర్పడింది. ఇంగ్లీషు భాషా సంపర్కం వల్ల సాహిత్యంలో క్రొత్త ప్రక్రియలు చోటుచేసుకో సాగాయి. మరొక వైపు దైవభావాన్ని అంగీకరిస్తూ మతాన్ని హేతువాద దృష్టితో పరికించే బ్రహ్మ సమాజం ఆంధ్రదేశంలో అడుగుపెట్టింది. సమాజంలో నెలకొని యున్న సనాతనాచారాలైన విగ్రహారాధనను, కులవ్యవస్థను, స్త్రీ స్వాతంత్ర్యాన్ని బ్రహ్మసమాజం వ్యతిరేకించింది.

దీనికంటే కూడా ఆ కాలంలో మన సంఘాన్ని పట్టి పీడించిన దురాచారాల్లో ముఖ్యమైనవి. కన్యాశుల్కం, బాల్యవివాహాలు, దీని ద్వారా ప్రాప్తించే వైధవ్యం, సానివృత్తి, ఇంకా అసంఖ్యాక గ్రామదేవతలకిచ్చే బలులు అర్థంలేని మూఢనమ్మకాలను వ్యతిరేకించింది. బ్రహ్మసమాజాన్ని రాయ్ స్థాపిస్తే, ఆ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళినవాడు ఈశ్వరచంద్ర విద్యాసాగర్ తెలుగుదేశానికి సంబంధించినంత వరకు 1857 నాటికే ఆధునిక సంస్కరణ భావాలు ప్రవేశించాయి రాజమండ్రిలో ఫస్ట్‌క్లాస్ డిస్ట్రిక్ మున్సిఫ్ పదవిలో ఉన్న సామినేని ముద్దు నరసింహానాయునింగారు "ప్రమేయం" అన్నపేరుతో 1842–47ల మధ్య "హితవాది"యన్న పత్రికలో కొన్ని వ్యాసాలు ప్రకటించారు. 1862లో ఆ ప్రమేయాలే "హితసూచని" అన్నపేరుతో సంకలనంగా వచ్చింది. ఈ వ్యాసాలలో హేతువాదం, సంస్కరణ ప్రియత్వం, మూఢ విశ్వాసాల ఖండన, వైజ్ఞానిక దృష్టి మొదలైనవి కనిపిస్తాయి.

కాన్యశుల్కం, బాల్యవైధవ్యం, స్త్రీవిద్య, స్త్రీ పునర్వివాహం మొదలైన అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. ఏనుగుల వీరాస్వామి కాశీయాత్ర చరిత్రలో కూడా సంఘ సంస్కరణ భావాలున్నాయి. సతీ సహగమనానికి మూల స్మృతి ప్రమాణం లేదని ఇందులో ఆయన చర్చించారు. హిందూమతంలోని మూఢాచారాలు చాలా అపరాధంగా తోచి, భగవంతుడే ఈ కర్మ భూమిని పాలించటానికి ఇంగ్లీషువారిని పంపాడని ఏనుగుల వీరాస్వామి అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

లౌకిక విద్యావిధానం వల్ల విద్యాసంస్థలలో, ఇతర సంస్థలలో అన్ని కులాలవారికీ ప్రవేశాలు లభించాయి. అస్పృశ్యతా నివారణ ఒక నినాదం అయింది సహపంక్తి భోజనాలు కులాంతర, మతాంతర వివాహాల ప్రారంభమయ్యాయి. బహుభార్యాత్వాన్ని వ్యతిరేకించటం, విధవా వివాహాలను ప్రోత్సహించటం, స్త్రీ విద్యను ప్రోత్సహించటం సంఘసంస్కరణలలో భాగమయింది. ఆర్థిక వ్యవస్థ పునాదిగాగల కులవ్యవస్థ దెబ్బతిన్నది. చదువుకున్న వారిలో అఖిలభారత దృక్పథం యేర్పడింది.

వీరేశలింగం పంతులుగారి సంస్కరణోద్యమాన్ని స్వాతంత్ర్యోద్యమంతో మౌలికంగా సమన్వయించిన వాడు చిలకమర్తి, లక్ష్మీ నరసింహం పంతులు. ఆయన నవలల ద్వారా సంఘ సంస్కరణోద్యమాన్ని, చారిత్రక వ్యక్తుల కథా రచనల

ద్వారా జాతీయతా భావాన్నీ స్వాతంత్ర్య కాంక్షను చిలకమర్తి జనానికందించారు. ఇది ఇట్లుండగా వ్యావహారిక భాషోద్యమ రూపంగా భాషారంగానికి కూడా సంస్కరణోద్యమాన్ని విస్తరింపజేసిన మహామనీషి గిడుగు రామమూర్తి పంతులు గారు. ఆయనకు తోడుగా సృజనాత్మక సాహిత్యంలో ఈ ఉద్యమాన్ని సజీవంగా ప్రతిఫలింప జేసిన గురజాడ అప్పారావుగారు, సామాజిక సమస్యాత్మకమైన రచనా వ్యాసంగానికి "కన్యాశుల్కం రచన ద్వారా మార్గ దర్శకులైనారు. సంస్కరణోద్యమంతో పాటు క్రమంగా యెదుగుతున్న దేశభక్తి భావాన్ని, స్వాతంత్ర్య కాంక్షను ప్రతాపరుద్రీయ నాటకం ద్వారా జనానికందించినవారు వేదం వేంకటరాయ శాస్త్రిగారు వీరందరితోపాటు ఈ ఉద్యమాలను మరింత తీవ్రతరం చేసిన వైనాన్ని సంస్కరణ కవితలు వ్రాసిన కవివరేణ్యుల భూమికను తెలుసుకోవలసిన అవసరం ఉంది.

విద్యుచ్ఛక్తి రాకముందున్న ప్రపంచానికీ, విద్యుచ్ఛక్తి కనుగొన్న తరువాతి ప్రపంచానికీ ఎంత వ్యత్యాసం ఉన్నదో వీరేశలింగం గారి తర్వాత ఆంధ్ర సాహిత్యానికి అంత భేదం ఉంది. వీరేశలింగంగారు దారి చూపిన సంఘ సంస్కరణోద్యమాలు ఆంధ్ర సంఘంలోని కల్మషాన్ని చాలా వరకూ కడిగివేశాయి. ఆంగ్లేయులు వీరేశలింగంగారి ఉద్యమాలకు బాసటగా నిలిచారు.

ఆంధ్రదేశమున నాడు వ్యాప్తములైన దురాచారములన్నింటిపై వీరేశలింగంగారు మత విప్లవ ధ్వజమెత్తిరి. బాల్య వివాహములు, వేశ్యావృత్తి, కన్యాశుల్కం, వరశుల్కం, విగ్రహారాధనం, వర్ణవ్యవస్థ మున్నగు వానిని నిరసించుచు వీరనేక వ్యాసములు వ్రాసిరి.

19వ శతాబ్దిలో భారతదేశంలో ఆధునిక విద్య మెల్లమెల్లగా వ్యాప్తిపొందింది. బ్రిటీషువారు భారతదేశంలో తమ పరిపాలన సజావుగా సాగడానికి అవసరమైన ఉద్యోగులను తయారు చేసే ఉద్దేశ్యంతో ప్రవేశ పెట్టిన విద్యావిధానానికి విద్యావంతులైన భారతీయుల మద్దతు లభించింది. భారతదేశంలో గతంలో ఉన్న విద్యా విధానంకంటే ఇది చాలా మెరుగైంది. ఆంగ్లభాష అభ్యసించడం వలన ఆధునిక విజ్ఞానశాస్త్రం. హేతువాదం, ప్రజాస్వామ్యం వంటి అభ్యుదయ భావాలు భారతీయులకు కలిగాయి. ప్రారిశ్రామిక సంస్కృతీ నాగరికతలతో పరిచయం యేర్పడింది. ఈ కాలంలో భారతీయులు కూడ విద్యాలయాలను స్థాపించారు.

భూస్వామ్య ఆర్థిక విధానం స్థానంలో మార్కెట్టుతో ముడిపడిన వలస ఆర్థిక విధానం ప్రవేశించటం వల్ల అందుకనుకూలమైన ఆధునిక విద్యావిధానం మాత్రమే కాకుండా మత సాంఘిక సంస్కరణలు కూడా వచ్చాయి. అందులో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం ముఖ్యమైనవి.

బ్రహ్మసమాజం విగ్రహారాధనను, కులభేదాలను నిరసించింది. సతీ సహగమనానికి, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడింది. స్త్రీ పునర్వివాహాలు జరగడానికి కృషి చేసింది. స్త్రీ పురుషులకు సమాన హక్కులు ఉండాలని వాదించింది. ఆర్య సమాజం కులవ్యవస్థను వ్యతిరేకిస్తూనే వర్ణాశ్రమ వ్యవస్థను అంగీకరించి, పుట్టుకను బట్టి కాకుండా, ప్రతిభనుబట్టి వర్ణాన్ని నిర్ణయించాలని అన్నది. మాతృభాషలో విద్యాబోధన చేయడానికి ఆర్య సమాజం కృసి చేసింది.

ఈ జాతీయోద్యమ చరిత్ర మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న ఆంధ్రప్రాంతానికి కూడా స్థూలంగా వర్తిస్తుంది. జాతీయోద్యమంలో ప్రతి ముఖ్యమైన సంఘటనా మనకు ఆంధ్ర ప్రాంతంలో కనిపించినా, కనిపించకపోయినా ఒక మొత్తంగా దాని ప్రభావమైనా కనిపిస్తుంది. బెంగాల్ విభజన తరువాత కొంత కాలానికి మొదలైన ఆంధ్రోద్యమం, జాతీయోద్యమంలో అంతర్భాంగంగా కొనసాగింది. ఆంధ్రోద్యమానికి ఆంధ్రదేశంలో విలసిల్లిన వివిధ సంస్కరణోద్యమాలకు తగిన ఆర్థిక నేపథ్యం 19వ శతాబ్దిలో ఉంది.

1850లో సర్ ఆర్థర్ కాటన్ కృష్ణా గోదావరి నదుల మీద ఆనకట్టలు కట్టి వ్యవసాయానికి నీటిపారుదల సౌకర్యాన్ని కల్పించడంతో కోస్తా ఆంధ్ర ప్రాంతం వ్యావసాయికంగా అభివృద్ధి చెందింది. ఇది ఆంధ్ర ప్రాంత విద్యాసంస్కృతుల అభివృద్ధికి దారితీసింది. వీటిద్వారా వచ్చిన ఆధునిక భావచైతన్యమే కందుకూరి వీరేశలింగం, కట్టమంచి రామలింగా రెడ్డివంటి సంస్కరణవాదులను తయారు చేసింది. వీరేశలింగం 1878లో రాజమండ్రిలో సాంఘిక సంస్కరణ సంస్థను స్థాపించి, పత్రికా ప్రచురణను ప్రారంభించి, స్త్రీ పునర్వివాహం, స్త్రీవిద్య మొదలైన సాంఘిక సంస్కరణలతో పాటు అనేక మూఢాచారాలను ప్రతిఘటించడం ప్రారంభించాడు. అదేదారిలో ప్రయాణించిన చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు జాతీయోద్యమంలో కూడా పనిచేశారు. కన్యాశుల్కానికి, బాల్యవివాహాలకు, వ్యతిరేకంగా సాహిత్యం ప్రధాన సాధనంగా గురజాడ ఉద్యమించాడు. వాడుక భాషను ఒక స్థాయి కల్పించడంలో గిడుగు రామమూర్తి పంతులు పోరాటం చేశాడు.

"దేశమున నాడు వ్యాప్తములైయున్న దురాచారములన్నింటిపై వీరేశలింగం గారు మతవిప్లవ ధ్వజము నెత్తి

బాల్యవివాహములు, వేశ్యావృత్తి, కన్యాశుల్కం, వరశుల్కం, విగ్రహారాధనము, వర్ణవ్యవస్థ మున్నగు వానిని నిరసించుచు వీరనేక వ్యాసములను వ్రాసిరి. కానీ, వీనిలో వీరు కార్యరూపమున సాధించినది చాలా తక్కువ. వితంతు వివాహములను జరిపించుటలో మాత్రము వీరు సంపూర్ణ విజయమును సాధించి రనవచ్చును. స్త్రీలు విద్యావంతులగుట దేశశ్రేయస్సునకు మూలమని ధృఢముగా విశ్వసించిన వారిలో వీరేశలింగముగా రొకరు. స్త్రీ విద్యాభివృద్ధికై వీరు ధవళేశ్వరమున నొక బాలికా పాఠశాలను స్థాపించిరి".

గత శతాబ్దంలో సంఘాన్ని సంస్కరించడానికి పూనుకున్న నాయకులకు సాంఘిక దురాచారాలకు మతం కూడా కారణమేనని నిలకడ మీద తెలియవచ్చింది. అందువల్ల వారు మతాన్ని సంస్కరిస్తే తప్ప సంఘం బాగుపడదనే నిర్ణయానికి వచ్చారు. ఈ ఉద్యమంలో భాగంగా బ్రహ్మసమాజం అవతరించింది. విగ్రహారాధనను వ్యతిరేకించి, ఏకేశ్వరోపాసనను ప్రచారం చేయటంతో పాటుగా మద్యపానాన్ని, వేశ్యావృత్తిని నిర్మూలించి సాంఘిక స్వేచ్ఛను, స్వచ్ఛతను సాధించటానికి కూడా బ్రహ్మ సమాజవాదులు పూనుకున్నారు. తెలుగునాట వీరి నాయకత్వంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు ఆయన మద్రాసులో కళాశాల అధ్యాపకులుగా ఉన్నరోజులలోనే సాంఘిక స్వచ్ఛత కోసం ఉద్యమించి, 1894 నాటికి కొన్ని విజయాలు సాధించాడు. 1905లో పిఠాపురం రాజా కళాశాలకు ప్రిన్సిపాల్ కావడంతో ఉద్యమం ఊపందుకుంది.

వేశ్యావృత్తికి సంబంధించిన చర్చప్రధానంగా నైతిక దృష్టితో సాగేది. వేశ్యలవల్ల సంఘానికి జరిగే అపకారం గురించిన చర్చ జరిగినంతగా సంఘం వల్ల వేశ్యలకు జరుగుతున్న అన్యాయం గురించిన చర్చ జరిగేదికాదు.

ఆంధ్రదేశంలో సంస్కరణోద్యమాన్ని వెల్లువలాగా ప్రవహింపజేసిన ధీరుడు వీరేశలింగం. ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్రదేశానికి సాంఘికంగా వినూతన జాగృతిని కలిగించిన ప్రప్రథమ వైతాళికుడు వీరేశలింగం. వీరు ప్రాచ్య పాశ్చాత్య విజ్ఞానాన్ని సమస్మృతిలో మేళవించుకున్నవారు. సంఘంలో పాతుకుపోయిన దురాచారాలు వారి వజ్రఘాతాలకు యెరవై కుత్తునియలైనాయి. బాల వితంతువులకు పసుపు కుంకుమలు ప్రాప్తించాయి. పాశ్చాత్య నాగరికత వల్ల కొందరికన్నా ఛాందసదృష్టి తొలగిపోయింది. ఆనాటి తెలుగువారి మనః పరివర్తనానికి ఈ సంస్కరణోద్యమం యెంతో ఉపకరించింది. వారి హృదయాల్లో కొత్త ఆకాంక్షలు మెరిదాయి. వారికి కొత్త ఊపిరి పోసింది.

ఈ విధంగా ఆంధ్ర జాతీయ సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి వీరేశలింగం నాయకత్వం వహించారు. "బాల్యవివాహాలు, భోగం మేళాలు, మత మౌఢ్యం, అస్పృశ్యత మొదలైన వాటిని నిర్మూలించటానికి వీరు మహోద్యమం నడిపారు. ఈ మహోద్యమాలకు పత్రికలు ప్రధాన స్థానాలయ్యాయి. తెలుగుదేశంలో వాస్తవంగా పత్రికారంగం రూపొందింది. పునరుజ్జీవనోద్యమంలోనే అని తేటతెల్లమౌతుంది".

## Bibliography


1. ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి - ఖండవల్లి లక్ష్మీరంజనం
2. సాహిత్యం సంస్కరణ విప్లవం - ఎం.వి.రమమూర్తి
3. తెలుగుకవిత - సాంఘిక సిద్ధాంతాలు - ముదిగొండ వీరభద్రయ్య
4. రాయప్రోలు సాహిత్యం - సంస్కరణ దృక్పథం వ్యాసం - డా॥పి.సుమతీ నరేంద్ర
5. తెలుగునవలలో సామాజిక చైతన్యం
6. మనదేశంలో పునర్వికాసం రాదా? - డా॥జన్నయ్య
7. భారతీయ పునరుజ్జీవనం - డి.రామలింగం 1980
8. వీరేశలింగం పంతులు - సమగ్ర పరిశీలన - డా॥అక్కిరాజు రమాపతిరావు 1972
9. బోయి భీమన్న(అనువాదం) - కుల నిర్మూలన - హైదరాబాద్ బుక్ ట్రస్ట్ హైదరాబాదు 1990
10. గ్రామీణ సామాజిక పరివర్తన తెలుగు అకాడమీ హైదరాబాద్ 1978
11. ఆంధ్రారచయితలు, రాజమహేంద్రవరం, అద్దేపల్లి అండ్ కో
12. అమరావతి పబ్లికేషన్స్ వారి తెలుగు వెలుగులు పుస్తకము
13. B. Kesava Narayana, Political and Social Factors in Modern Andhra
14. P.R.Rao, History of Modern Andhra
15. V.Ramakrishna, Social Reform Movement in Andhra
16. B.Kesava Narayana, Modern Andhra & Hyderbad - 1858- 1956 A.D., 2016